# కళ్లు

నా కళ్లు అందమైనవి అంటుంది అమ్మ. కళ్ల నిండుగా కాటుక పెడుతుంది. 'పచ్చటి చెంపల మీదుగా నల్లటి కాటుకా, తెల్లని కళ్లలో నల్లని కాటుకా ఎంత కళ ఉందే నీ కళ్లలో' అంటుంది వదిన కూడా.

నిజమే నా కళ్లు పెద్దవే- కానీ, ఏం లాభం? వాళ్ల రాముడివి చింతాకంత కళ్లు. చీకిరి కళ్లు. నాకూ పదేళ్లే. వాడికీ పదేళ్లే. ఇంకా పది రోజులు వాడికంటే నేనే పెద్దదాన్ని. కానీ, మా ఊళ్లో వాడు చూసిన వింతల్లో వందోవంతు కూడా నేను చూడలేదు. మొన్నొక రోజు మా వాకిట్లో పెద్ద గొడవ అయింది. నేను బయటకు పరుగెత్తి గుంపులో నుంచున్నా. ఎక్కడ్నించి వచ్చాడో ఏమో మా అన్నయ్య బరబరా లాక్కొచ్చి ఇంట్లో పడేశాడు.

"ఆడపిల్లవు భయం లేకుండా ఎట్లా నుంచున్నావే – ఆ అరుపులు ఇంట్లో ఉండి వింటుంటేనే గుండె దడదడలాడుతుంటేనూ" అంది అమ్మ.

"నాకు భయం వెయ్యలేదు" అని చెబితే అందరూ తిట్టిపోశారు. మా వదిన పిరికితనం చూస్తే మా అన్నయ్యకి ఎంత సంతోషమో. ఒదిన్ని భయపెట్టి ఆమె దడుచుకుంటే కిలకిలా నవ్వుతాడు. ఒదిన కూడా అంతే – మాట్లాడితే "అమ్మో భయం" అని కళ్లు మూసుకుంటుంది. "కళ్లు తెరిచి చూడు ఒదినా ఏం లేదంటే" తెరవదే. ఒదిన కళ్లు కూడా పెద్దవే. కానీ, ఏం లాభం? ఒదినకు ఆ కళ్లు మూసుకుని ఉండటమే బాగుంటుంది. వీధిలోకి ఒస్తారా – అమ్మా, ఒదినా ఇక తలెత్తరు. వాళ్ల కళ్లన్నీ నేలమీదనే. నేలమీద ఏముంటాయి? ఒకవేళ ఏమన్నా ఉన్నా ఎన్ని రోజులు అవే చూస్తాం? వీధిలో ఏమున్నాయో సరిగ్గా చూడనే చూడరు. పైగా అమ్మ నన్ను తిడుతుంది.

'అలా దిక్కులు చూస్తావేం' అని. 'తలొంచుకు నడువు. నేలమీద చూడు' అంటూ మొట్టికాయలు వేస్తుంది.

అమ్మో – నేనసలు అట్లా నడవను. వీధిలోకి ఒచ్చినపుడు అటూ ఇటూ చూడకపోతే అన్నీ నాకెట్లా తెలుస్తాయి? ఇరవై నాలుగ్గంటలూ వీధిలో తిరిగే రాముడు నన్నసలు లెక్క చేస్తాడా?

కానీ, వాడికి కూడా చాలా తెలియవు. ఆడవాళ్లు కొన్నిటిని మాత్రమే చూస్తే చాలని వాడికి తెలియదు. అమ్మకు అవన్నీ బాగా తెలుసు.

మన ఒంటిని కూడా మనం సరిగా చూసుకోగూడదు. అమ్మ కేకలేస్తుంది, ఏంటా చూడటం అని. పెద్దవుతున్న కొద్దీ మగవాళ్లని అసలు సరిగ్గా చూడకూడదు. ఇప్పుడు నేను రాముడితో ఆడుకుంటున్నానా, ఇంకో రెండేళ్లు పోతే రాముడితో ఆడుకోగూడదు. రాముడు కనపడగానే ఇంట్లోకి వెళ్లాలి. బజార్లో కనబడితే తల పైకెత్తకుండా కళ్లు మాత్రం పైకెత్తి చూడాలి. మా పక్కింట్లో ఉండే పద్మక్క అట్లాగే చూస్తుంది. ఎందుకక్కా అట్లా చూస్తావూ అంటే అలా చూస్తేనే భలే అందంగా వుంటుందట. నాకింకా చేతకావటంలా అట్లా చూడటం. ఎప్పటికొస్తుందో ఏమో– రాముడికైతే చచ్చినా రాదు.

ఆడవాళ్ల కళ్లవెంట నీళ్లు తొందరగా రావాలిట. మొన్న అమ్మ పక్కింటామెను తిడుతోంది. "రాతి గుండె. కంటెమ్మట చుక్క నీళ్లు రాలేదు" అని. ఆడవాళ్లకి ఊరికూరికినే ఏడుపు రావాలిట. నాకెందుకో కోపం వస్తుందిగానీ, ఏడుపు రాదు. నన్ను ఊరికే తిడితే నాకు కోపం వస్తుంది. ఒదినకైతే ఏడుపొస్తుంది. అప్పుడన్నయ్య కోపం తగ్గుతుంది.

'చాల్లే ఇక ఆ ఏడుపు ఆపు' అంటాడు. ఐనా సరే ఒదిన కుమిలి కుమిలి ఏడుస్తుంది. అన్నయ్యా, ఒదినా పోట్లాడుకుంటే ఎప్పుడూ ఒదినే ఏడుస్తుంది. అన్నయ్య ఒక్కసారీ ఏడవడు. అమ్మా నాన్నా అయినా అంతే– ఎప్పుడూ అమ్మే ఏడవాలి. నాకు ఏడుపంటే ఇష్టం లేదు. ఏడిస్తే నా కళ్లు ఏమీ బాగుండవు. మొహమంతా నల్లగా కాటుకవుతుంది. నేనెప్పుడూ ఏడవను బాబూ. మన కళ్లకి ఏం కనపడ్డా సరే మనం ఏం అనగూడదంట– ఏం చెయ్యకూడదంట.

నాకు నాన్న చేతిలో మామిడిపళ్ల బుట్ట కనపడిందనుకో – 'ఓ మామిడి పళ్లో' అని ఎగర బుద్ధేస్తుంది. ఎగర కూడదంట. ఆ మామిడి పండు మన కంచంలోకి వచ్చేవరకూ అరవకూడదంట. మనం కంచంలోకి వచ్చాక బుద్ధిగా తినాలంట. మామిడిపళ్లు చూడగానే ఎగరకపోతే చూసిన ఫలితం ఏముంది?

అలాగే కోపం వచ్చేవి చూసినా అరవకూడదంట. అప్పుడొక రోజు ఏమయింది? కల్యాణి అక్క కాలేజీ నుంచి ఒస్తుంటే ఒకబ్బాయి సైకిల్ మీదనుంచి పడిపోయాడు గదా– కాలు బెణికి లేవలేకపోయాడు. రోడ్డుమీదేమో ఎవరూ లేరు. కల్యాణి అక్క అతన్ని లేపి, సైకిల్ని స్తంభానికి ఆనించి పెట్టింది. ఆ అబ్బాయి కాలు విదిలించుకుంటుంటే అతను పడకుండా పట్టుకుందట. ఇదంతా మా ఎదురింటి మామయ్య చూసి కల్యాణి వాళ్ల నాన్నతో చెప్పాడట. కల్యాణి వాళ్ల నాన్న కూడా మామయ్యే. కానీ, అక్కను అట్లా కొట్టాక నాకు కోపం వచ్చి మామయ్యతో పలకటం మానేశా. కల్యాణి అక్కని బాగా కొట్టాడు. పరాయి మగాడిని రోడ్డుమీద కావలించుకుంటావా – అని తిడుతూ కొట్టాడు. పడిపోతే చూసి లేవదీశానంటే – చూస్తే చూశావు నీ దారిన నువ్వు రావాలిగాని దేశసేవ చేస్తావా అంటూ తిట్టాడు. చూసిన తర్వాత ఏదన్నా చెయ్యాలి గదా – లేకపోతే చూడటం ఎందుకు? చూడకముందూ చూసిన తర్వాతా ఒకే రకంగా వుంటే చూడటం ఎందుకు? అంటే అమ్మకు అర్థం కాదు– నోర్మూసుకో అంటుంది.

కళ్లు మూసుకోవాలి. నోరు మూసుకోవాలి. మా అన్నయ్య ఆఫీసులో పనిచేసే ఆవిడొచ్చిందా – ఆవిడెంత బాగా నవ్వుతుందో. కానీ, చిత్రం ఆవిడ బొట్టు పెట్టుకోలేదు. కాటుక పెట్టుకోలేదు. ఐనా సరే ఎంత బాగుందో. ఉన్నంతసేపూ చక్కగా నవ్వుతూ ఉంది. ఆవిడ అమ్మకీ, ఒదినకూ నచ్చలేదుట. ముఖాన బొట్టు లేకపోతే మెళ్లో గొలుసు లేకపోతే ఆ ముఖమే రోతగా ఉంటుందట. 'నిజంగా బాగోలేదామ్మా, నిజంగా బాగోలేదామ్మా' అని ఎన్నిసార్లో అడిగాను. 'నా కళ్లకు పరమ రోతగా కన్పించిందే– బొట్టులేని ముఖం చూడబుద్ధవదు నాకు' అంది అమ్మ. అమ్మంత అయితే నా కళ్లు కూడా అమ్మ కళ్లలాగే మారిపోతాయా?

అమ్మో– అలా మారిపోతే నా కళ్లకు ఏమీ కనపడవు.

'ఎక్కడెక్కడివన్నీ నీ కళ్లకే కనిపిస్తాయేమిటే' అంటుంది అమ్మ. అమ్మ కళ్లకు ఏమీ కనిపించవు. కనిపించిన వాటిగురించి అమ్మ పట్టించుకోదు. ఆడవాళ్ల కళ్లు ఇట్లా ఎందుకుంటాయో–

❖

స్త్రీ శక్తి (ఆంధ్రజ్యోతి) 13-9-98